www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 1 మార్చి 2025 5 ఏలూరు



ఫుట్ ఓవర్‌బ్రిడ్జికి రూ.4.50 కోట్లు

ఏలూరు సిటీ: గుండుగొలను సమీపంలోని గరుడ హోటల్ వద్ద జాతీయ రహదారి దాటేందుకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన రూ.4.50 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం మంజూరు చేసింది. గరుడ హోటల్ వద్ద జాతీయ రహదారికి ఒకవైపు నుంచి మరోవైపునకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సందర్భంగా పలువురు మృత్యువాత పడగా మరికొందరు గాయాల పాలవుతున్నారు. దీనిపై స్థానికులు పలుసార్లు ఆందోళనలు సైతం నిర్వహించారు. దీనిపై స్పందించిన ఎంపీ అక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంతోష్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దీంతో నేషనల్ హైవే అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి వంతెన నిర్మాణ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు.

'సాగునీటి'కి అరకొర నిధులు..!



- చింతలపూడి ఎత్తిపోతలకు రూ.222 కోట్లే
- తాడిపూడి ఎత్తిపోతలకు రూ.14 కోట్లు
- డెల్టా ఆధునికీకరణకు ఉమ్మడి 'పశ్చిమ'కు రూ.11కోట్లు విదిలింపు
- పోలవరానికి రూ.6,705 కోట్లు
- నరసాపురంలో ఆక్వా యూనివర్సిటీకి రూ.36 కోట్లు
- ఆక్వా, వరి రైతులకు ప్రోత్సాహకాలు కరువు
- కౌలురైతులకు మొండిచెయ్యి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశ పెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్‌లో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం అరకొర కేటాయింపులతో సరిపెట్టింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలను అభివృద్ధి పథంలో నడిపేలా బడ్జెట్‌లో కేటాయింపులు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు జిల్లాల్లో 80 శాతం ప్రజానీకం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయానికి అత్యంత అవసరమైన సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో అరకొర నిధుల కేటాయింపుతో రైతుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. మెట్ట ప్రాంతానికి అత్యంత ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టు చింతలపూడి ఎత్తిపోతల. ఈ ప్రాజెక్టు దశాబ్దాల కాలంగా కొనసాగుతూనే ఉంది. తాము అధికారంలోకి వస్తే చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నుంచి ఎంపీలు, ఎంఎల్‌ఎలు పదేపదే చెబుతూనే ఉన్నారు. ఈ ప్రాజెక్టు పనులను రెండు దశల్లో పూర్తి చేస్తామని చెప్పారు. అందుకు మొత్తం రూ.3,782 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. మొదటి దశ పనులు 2026కు పూర్తి చేస్తామన్నారు. వచ్చే ఏడాదికి చింతలపూడి మొదటి దశ పూర్తి కావాలంటే రూ.1500 కోట్లకు పైగా ఖర్చు చేయాల్సి ఉంది. శుక్రవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో మాత్రం రూ.222 కోట్లు మాత్రమే కేటాయించారు. చింతలపూడి మొదటిదశ ఏవిధంగా పూర్తి చేస్తారో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. మెట్ట ప్రాంతంలో మరో సాగునీటి ప్రాజెక్టు తాడిపూడి ఎత్తిపోతల పథకం. ఈ ప్రాజెక్టు ప్రారంభించి దశాబ్దాలు గడిచినా పూర్తిస్థాయిలో సాగునీరు అందించలేని పరిస్థితి ఉంది. ఈ ప్రాజెక్టు పిల్ల కాలువలు పూర్తి చేయాల్సి ఉంది. రూ.200 కోట్లు కేటాయిస్తే ఈ ప్రాజెక్టు పనులు చాలావరకూ పూర్తయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. బడ్జెట్‌లో మాత్రం రూ.14 కోట్లు మాత్రమే కేటాయించారు. దీంతో ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. డెల్టా ప్రాంతంలో కాలువల ఆధునికీకరణ అత్యంత ప్రధానమైంది. పంట కాలువలు మెరకదేరి ప్రతియేటా వేలాది ఎకరాల్లో పంటను రైతులు నష్టపోతున్నారు. గత వైసిపి ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణ పనులను పూర్తిగా గాలికొదిలేసింది. ఈ ప్రభుత్వమైనా పట్టించుకుంటుందని రైతులు ఆశగా ఎదురుచూశారు. తూర్పు, పశ్చిమ ఉమ్మడి జిల్లాలకు డెల్టా ఆధునికీకరణ పనులకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.21 కోట్లు వరకూ కేటాయించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు రూ.11 కోట్లు వరకూ వచ్చే అవకాశం ఉంది. రెండు జిల్లాల్లో దాదాపు రూ.వెయ్యి కోట్లు వరకూ డెల్టా ఆధునికీకరణ పనులు జరగాల్సి ఉంది. దీంతో డెల్టా రైతాంగం తీవ్ర నిరాశలో కూరుకుపోయింది.

నిర్వాసితుల పునరావాసానికి అరకొర నిధులు

పోలవరం ప్రాజెక్టుకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.6,705 కోట్లు కేటాయించింది. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ప్రాజెక్టు నిర్వాసితులకు అందించే సాయానికి మాత్రం రూ.23 కోట్లే కేటాయించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో దాదాపు లక్ష కుటుంబాలు నిర్వాసితులుగా మారుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 21 వేల కుటుంబాలను తరలించాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.55 వేల కోట్లు వరకూ ఖర్చవుతుందని, అందులో నిర్వాసితుల పునరావాసానికి రూ.33 వేల కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. 2026కు ప్రాజెక్టు మొదటిదశ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ అందించడంతోపాటు కాలనీల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. అటువంటప్పుడు ఆర్అండ్ఆర్‌కు కేటాయించిన రూ.1410 కోట్లు ఎలా సరిపోతాయో ప్రభుత్వమే చెప్పాలి.

ఆక్వా యూనివర్సిటీకి రూ.36 కోట్లు

వ్యవసాయ బడ్జెట్‌ను ఈ ఏడాది రూ.48,441 కోట్లతో ఆ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. నరసాపురం ప్రాంతంలో ఏర్పాటైన ఆక్వా యూనివర్సిటీకి తరగతులు ప్రారంభమైనా సొంత భవనాలు లేకుండాపోయాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆక్వా యూనివర్సిటీకి బడ్జెట్‌లో రూ.36 కోట్లు నిధులు కేటాయించారు. ఆక్వా, వరి రైతులకు మాత్రం బడ్జెట్‌లో ఎటువంటి ప్రోత్సాహకాలూ లేకుండాపోయాయి. గతం నుంచి అమలవుతున్న విద్యుత్ సబ్సిడీ గురించి మాత్రమే ప్రస్తావించారు. ఆక్వా మేత ధరలు పెరిగిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరల హెచ్చుతగ్గులతోనూ నష్టాలు చవిచూస్తున్నారు. ఆక్వా రైతులకు ఊరటనిచ్చే నిర్ణయాలు బడ్జెట్‌లో లేకుండాపోయాయి. వరి రైతులకు బడ్జెట్‌లో ప్రోత్సాహకాలు లేకుండాపోయాయి. పామాయిల్ అంశంలో కొత్త తోటల సాగుకు సంబంధించి ప్రస్తావించడం తప్ప రైతులకు మేలు చేసే నిర్ణయాలు కనిపించలేదు. నూజివీడులో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో చెప్పారు. బడ్జెట్‌లో నిధులు మాత్రం కేటాయించలేదు. ఎన్నికల హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవకు రూ.9,400 కోట్లు కేటాయించారు. అదే సందర్భంలో కౌలురైతుల ప్రస్తావన లేకుండాపోయింది. కౌలురైతులకు మొండిచెయ్యి చూపిన పరిస్థితి నెలకొంది. దీంతో రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ప్రజలపై భారాలు మోపేలా రాష్ట్ర బడ్జెట్

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలపై భారాలు మోపేలా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కమిటీ తరపున ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్లో సంక్షేమం, రాష్ట్ర అభివద్ధికి దోహదం చేసేలా ప్రతిపాదనలు లేవని పేర్కొన్నారు. రూ.80 వేల కోట్లు ద్రవ్యలోటు, రూ.14 వేల కోట్ల పన్ను ఆదాయం, రూ.12 వేల కోట్ల పన్నేతర ఆదాయం చూపించడం ద్వారా ఈ భారాలన్నీ ప్రజలపైనే మోపబోతున్నట్లు వెల్లడవుతుందని తెలిపారు. విద్యుత్ భారాలు మోపే సెకి ఒప్పందంపై బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం సరికాదని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ముందు డిఎస్‌సి, నిరుద్యోగ భృతి తదితర అంశాలు మాట్లాడి ఎన్నికల అనంతరం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆ ఊసు లేకపోవడం ఏరుదాటేక తెప్పతగలేసిన పద్ధతిలో ఉందని తెలిపారు. ఎన్నికల ముందు అంగన్వాడీ, ఆశా, మున్సిపల్ తదితర కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు ఈ బడ్జెట్లో ఎటువంటి కార్యరూపం లేదని పేర్కొన్నారు. నీటిపారుదలకు మొత్తంగా పెరుగుదల ఉన్నా శాతం రీత్యా గతంకంటే తగ్గుదల ఉందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఊసే తప్ప నిర్వాసితుల ఊసు లేకపోవడం సరికాదని పేర్కొన్నారు. జిల్లాలో కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణం తదితర సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని రవి డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పంచాయతీరాజ్ శాఖకు రూ.18,848 కోట్లు కేటాయించి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసింది. దీంతో గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేసినట్లయింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పింఛన్లకు బడ్జెట్ కేటాయింపులు అభినందనీయం. బిసి సంక్షేమానికి రూ.47,456 కోట్లు, ఆదరణ కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయించడం శుభపరిణామం. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వం బిసి సంక్షేమాన్ని గాలికొదిలేసింది.

ఉసూరుమనిపించిన బడ్జెట్

పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక శుక్రవారం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ పేదలను, మహిళలను ఊరించి ఉస్సూరుమనిపించింది. సూపర్ సిక్స్ హామీలకు అరకొర కేటాయింపుల వల్ల ఫలితం శూన్యం. వంట గ్యాస్ సిలెండర్లకు రూ.4115 కోట్లు అవసరం ఉండగా బడ్జెట్‌లో రూ.2601 కోట్లే కేటాయించడం మోసకారితనమే. బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉత్తిమాటే. కాపు సంక్షేమానికి ఐదేళ్లలో రూ.15 వేల కోట్లు అని హామీ ఇచ్చి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు.

గెలుపు కోసం దొంగ ఓట్లు..!

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ అడ్డదారులు

మధ్యాహ్నం 2 గంటలు తర్వాత భారీగా దొంగ ఓట్లు పోలైనట్లు ఆరోపణలు

మొదటి 6 గంటల్లో 45.29 శాతం పోలింగ్ నమోదు

చివరి 2 గంటల్లో 25 శాతం వరకూ పోలింగ్

జిరాక్స్ ఐడి కార్డులతో ఓటుకు అనుమతించిన అధికారులు

ఏడెనిమిది శాతం దొంగ ఓట్లు పోలైనట్లు జనాల్లో చర్చ

ఎన్నికల అధికారులు, పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపు కోసం అధికార పార్టీ అడ్డదారులు తొక్కడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దూరప్రాంతాల్లో ఉండి రానివారి ఓట్లను అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలే వేసేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల అధికారులు, పోలీసులు పూరిస్థాయిలో అధికార పార్టీ నేతలకు సహకరించడంపై తీవ్ర చర్చ సాగుతోంది. నిబంధనల ప్రకారం ఒరిజినల్ ఐడి ప్రూఫ్ చూపిస్తేనే ఓటు వేసేందుకు అనుమతివ్వాలి. అయితే జిరాక్స్ ఐడి ప్రూఫ్‌తో ఓటేసేందుకు పోలింగ్ బూత్‌లోని అధికారులు అనుమతివ్వడం నిబంధనలకు విరుద్ధం. పలుచోట్ల దీనిపై నిలదీయడం, ఘర్షణలు జరిగినా అధికారులు పట్టించుకోని పరిస్థితి. ఈ నెల 27వ తేదీ గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ సాగింది. ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతాన్ని అధికారులు ప్రకటించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల మధ్య జరిగిన పోలింగ్ సరళిని చూస్తే దొంగ ఓట్లు భారీగా పోలైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యాహ్నం రెండు గంటలకు అధికారులు విడుదల చేసిన పోలింగ్ లెక్కల ప్రకారం 45.29 శాతం ఓటింగ్ జరిగింది. అప్పటి వరకూ మొత్తం 3,14,984 ఓటర్లకుగాను 1,42,647 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అప్పటికి పోలింగ్ ప్రారంభమై ఆరు గంటలు పూర్తయ్యింది. మరో రెండు గంటలు మాత్రమే పోలింగ్ సమయం మిగిలింది. ఇంకా పెద్దఎత్తున ఓటర్లు వచ్చినా 60 శాతం పోలింగ్ మించదని అంతా అంచనా వేశారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో జరిగిన మొత్తం పోలింగ్ 69.50 శాతంగా నమోదైంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకూ జరిగిన పోలింగ్ ఏకంగా 25 శాతం వరకూ ఉంది. చివరి రెండు గంటల్లో 76 వేలకుపైగా ఓట్లు పోలయ్యాయి. ఇదెలా సాధ్యమో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి. ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు వేసేందుకు సమయం పడుతోంది. బ్యాలెట్ మడత పెట్టి ఇవ్వడం, మళ్లీ ఓటువేసి జాగ్రత్తగా మడత పెట్టి బ్యాలెట్ బాక్సులో వేసేందుకు కొంత సమయం పడుతోంది. అలాంటిది చివరిలో అంత పెద్దమొత్తంలో ఓటింగ్ ఏవిధంగా జరిగిందో తెలియని పరిస్థితి నెలకొంది. చివరి రెండు గంటల్లో అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు ఇష్టానుసారంగా రెచ్చిపోయారు. దూరప్రాంతాల నుంచి రాని ఓటర్ల ఆధార్ కార్డుల జిరాక్స్‌లు సంపాదించి ఓట్లు వేసిన పరిస్థితి ఉందని పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న ఇతర అభ్యర్థులకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు, కొంతమంది ఓటర్లు సైతం చెబుతున్నారు. జనాల అంచనా ప్రకారం ఏడు నుంచి ఎనిమిది శాతం దొంగ ఓట్లు పోలయ్యాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మధ్యాహ్నం రెండు గంటల వరకూ పిడిఎఫ్ అభ్యర్థికి అనుకూలంగా ఓటింగ్ సాగుతుందనే ప్రచారంతో అధికార పార్టీ నేతలు చివరిలో ఈ తరహా ఓటింగ్‌కు దిగినట్లు తెలుస్తోంది. పెదవేగి వంటి మండలాల్లో దొంగ ఓట్లపై నిలదీసిన పిడిఎఫ్ నాయకులపై అధికార పార్టీ నేతలు పోలీసులు చూస్తుండగానే దాడికి దిగడమే దీనికి నిదర్శనం. అధికారంలో ఉన్నవారు ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిందిపోయి అడ్డదారుల్లో ఎన్నికల్లో గెలుపు కోసం ప్రయత్నించడంపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. మధ్యాహ్నం రెండుగంటల తర్వాత పోలింగ్ బూత్‌ల సమీపంలోనే ఓటర్లకు డబ్బు పంపిణీ విచ్చలవిడిగా సాగింది. పోలీసులు ఎక్కడా అడ్డుకోని పరిస్థితి నెలకొంది. వీటన్నింటినీ అధికారులు కట్టడి చేయకపోవడం అత్యంత దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు


ఏర్పాట్లన్నీ పూర్తి : ఆర్ఐఒ కె.యోహాన్



పరీక్షా కేంద్రంలో బెంచీలపై నెంబర్లు వేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఇంటర్ బోర్డు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ తెలిపారు. పరీక్షల ఏర్పాట్లపై శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 55 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొదటి సంవత్సరం విద్యార్థులు 18,453 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 15,058 మంది మొత్తం 33,511 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 740 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు, రెండు సిట్టింగ్ స్క్వాడ్లు నిరంతరం పరీక్షలను పర్యవేక్షిస్తాయని వివరించారు. విద్యార్థులను అరగంట ముందు నుంచి పరీక్ష హాల్లోకి అనుమతిస్తారని, తొమ్మిది గంటల తర్వాత ఎవరినీ పరీక్షకు అనుమతించబోరని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించామన్నారు. వైద్యఆరోగ్య శాఖ సహకారంతో అన్ని పరీక్షా కేంద్రాల్లో వైద్య సిబ్బంది ఒఆర్ఎస్ ప్యాకెట్లు, తగిన మందులతో అందుబాటులో ఉంటారని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, వంద మీటర్లలోపు జిరాక్స్ షాపులను మూసివేయిస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, పరీక్షలు రాసే విద్యార్థులు తగిన సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ఆర్‌టిసి బస్సులు నడపాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారన్నారు. జిల్లాలో వేలేరుపాడు, కుక్కునూరు, భీమడోలు, జీలుగుమిల్లి, కలిదిండిలోని పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని, అక్కడ ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా అన్ని చర్యలూ తీసుకున్నామని చెప్పారు. మొత్తం జిల్లాలో 17 ప్రభుత్వ కళాశాలలు, రెండు ఎయిడెడ్ కళాశాలలు, మూడు సాంఘిక సంక్షేమ శాఖ కళాశాలలు, రెండు హైస్కూల్ ప్లస్ పాఠశాలలు, 31 ప్రయివేటు కళాశాలల్లో ఈ పరీక్షలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షల గురించి ఎలాంటి సందేహాలున్నా, సమస్యలు ఎదురైనా కంట్రోల్ రూమ్ నెంబర్ 08812 230197కు కాల్ చేయాలని ఆయన సూచించారు.



వినతి అందిస్తున్న రైతులు, నేతలు

పామాయిల్ గ్రేడింగ్ సమస్య పరిష్కరిస్తాం

రైతులకు, రైతుసంఘ నేతలకు ఆయిల్‌ఫెడ్ అధికారుల హామీ

ప్రజాశక్తి - పెదవేగి

పామాయిల్ గెలల గ్రేడింగ్ సమస్యను పరిష్కరిస్తామని ఆయిల్‌ఫెడ్ అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. ఈ నెల 20న ఆయిల్‌పామ్ గెలల గ్రేడింగ్‌పై రైతులు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు శుక్రవారం ఆయిల్‌ఫెడ్ కర్మాగారంలో ఆయిల్‌పామ్ రైతులు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగార పరిధి ఆయిల్‌పామ్ రైతుసంఘం అధ్యక్షులు ఉండవల్లి వెంకట్రావు, రైతులు మన్నే బాబూరావు, బొల్లు రామకృష్ణ మాట్లాడుతూ రైతుల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. గెలల గ్రేడింగ్ వల్ల రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఆయిల్ రికవరీ శాతం పేరుతో రైతులను ఇబ్బందులు గురి చేయడం తగదన్నారు. 19.47 శాతం రికవరీ ప్రకారం నవభారత్ ఫ్యాక్టరీ ఇస్తున్నట్లుగా ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయిల్‌ఫెడ్ కర్మాగారం ప్రయివేటీకరణ ఆపాలని, కొత్త కర్మాగారం నిర్మాణం చేయాలని కోరారు. అనంతరం ఆయిల్‌ఫెడ్ మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ గ్రేడింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీ ఆధ్వర్యంలోనే గెలల కోతకు శిక్షణ వంటి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆయిల్ పామ్ రైతులు, ఆయిల్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల ఊసేదీ

బడ్జెట్‌పై సిఐటియు ఆవేదన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్లో కోటి మంది కార్మికుల ఊసే లేదని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని పథకాల అమలు కోసం కేటాయింపులు చేశామని చెప్పిన ఆర్థిక మంత్రి కార్మికుల వేతనాలు, సంక్షేమం కోసం ఎటువంటి ప్రతిపాదనలూ చేయలేదని విమర్శించారు. అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేస్తూ జిఒ ఇవ్వకుండానే అమలు చేశామని చెప్పడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆశా వర్కర్ల జీతాలు పెంపుదల గురించి ఎటువంటి ప్రస్తావన చేయకపోవడం తగదని తెలిపారు. లక్షలాది మంది చిరుద్యోగులు, స్కీమ్ వర్కర్ల జీతాలు పెరుగుతాయని ఎదురు చూస్తుంటే వారి ఆశలు అడియాశలు చేస్తూ వేతనాల గురించి కనీసం ప్రస్తావించలేదని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణ, హమాలీల సంక్షేమానికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రస్తావన కొరవడిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 50 లక్షల మంది షెడ్యూల్డ్ కార్మికుల వేతనాలు గురించి కూడా ఈ బడ్జెట్లో కనీసం ప్రస్తావించలేదని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు విస్మరిస్తూ బడ్జెట్ రూపకల్పన చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాలు పెంపుదల, సంక్షేమం కోసం బడ్జెట్ ప్రతిపాదనల్లో తగిన మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు

మార్చి నెల పెన్షన్ల చెల్లింపు ఒకటో తేదీ శనివారం ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఒకటో తేదీన పెన్షన్లు ఏదైనా కారణం చేత తీసుకోని వారికి మార్చి మూడో తేదీ సోమవారం పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. జిల్లాలో మార్చి నెలలో 2,60,452 మంది పెన్షన్‌దారులకు రూ.112.94 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వీటి పంపిణీ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అలాగే పెన్షన్ల పంపిణీ శనివారం ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభిస్తారని తెలిపారు. పెన్షన్ల పంపిణీలో 5,290 మంది సిబ్బంది పాల్గొంటారని, పెన్షన్ తప్పకుండా ఇంటి వద్దే ఇవ్వాలని స్పష్టం చేశారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు

అధికారులకు కలెక్టర్ ఆదేశం



సమీక్షిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

వేసవిలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆమె జెసి ధాత్రిరెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ఏలూరు నగరంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో తాగునీటి సరఫరాపై పూర్తి వివరాలను కమిషనర్‌ను ఆరా తీశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి చెరువులను, కాల్వలను మూసేలోగా పూర్తిస్థాయిలో నింపుకునేలా అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటి నిల్వలు, బావుల్లో నీటి పరిస్థితి, అద్దె ప్రాతిపదికన ప్రయివేటు బోర్ల వివరాలు, తాగునీటి ఎద్దడి ఎదురైనప్పుడు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా అంశాలపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. కాల్వల నుండి తాగునీటి అవసరాల కోసం నీరు సరఫరా చేసే సమయంలో ఎక్కడా కూడా అక్రమంగా నీటిమళ్లింపు జరుగకుండా చూడాలన్నారు. వేసవిలో నీటి ద్వారా సంభవించే వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, సిపిఒ సిహెచ్.వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ సత్యనారాయణ, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎపిఐఐసి జెడ్ఎం కె.బాబ్జి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, విద్యుత్ శాఖ ఎస్ఇ సాల్మన్‌రాజు, పౌర సరఫరాల శాఖ జిఎం శ్రీలక్ష్మి, ఆర్‌టిసి డిఎం బి.వాణి, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిఎల్‌పిఒ సుందరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల్లోకి బ్యాలెట్ బాక్సులు

అభ్యర్థుల సమక్షంలో సీలు వేసిన అధికారులు



సీల్ వేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ పరిధిలో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా, కాకినాడ జిల్లాల నుండి పటిష్టమైన పోలీసు భద్రతతో బ్యాలెట్ బాక్సులను సిబ్బంది గురువారం రాత్రి నుండి శుక్రవారం ఉదయం వరకు తీసుకొస్తూనే ఉన్నారు. సీళ్లు వేసిన బ్యాలెట్ బాక్సులను ఏలూరు సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూముల్లో సంబంధిత ఆర్‌డిఒలు, అభ్యర్థుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీలు వేసి భద్రపర్చారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఎన్నికల పరిశీలకులు సిహెచ్.శ్రీధర్, కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, రమణ, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, ఏలూరు తహశీల్దార్ శేషగిరిరావు పాల్గొన్నారు.

సౌకర్యాలపై కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు

ఎన్నికల విధులంటే కత్తిమీద సాము లాంటిది. అటువంటి బాధ్యతలను సిబ్బంది నుండి ఆశించేటప్పుడు వారికి ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది. ఈ విషయంలో ఏలూరు జిల్లా యంత్రాంగం తమ బాధ్యతలను నూటికి నూరుపాళ్లు నెరవేర్చడంలో ముందుంది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. పోలింగ్ అనంతరం ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని ఆరు జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులను పోలింగ్ సిబ్బంది ఏలూరు సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచేందుకు తీసుకొచ్చారు. బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లకు మొదటి బ్యాచ్ తీసుకొచ్చేసరికి గురువారం రాత్రి సమయమైంది. ఒకవైపు బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపు వంటి ముఖ్యమైన విధుల్లో తలమునకలై ఉన్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి మరోవైపు బ్యాలెట్ బాక్సులు తీసుకువచ్చిన సిబ్బంది, రిసెప్షన్ సెంటర్లో సిబ్బందికి రుచికరమైన ఆహారం అందించే విషయాన్ని కూడా ప్రత్యేకంగా తీసుకున్నారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన ప్రదేశంలో, మంచి రుచికరంగా తయారయ్యేలా దగ్గరుండి పర్యవేక్షించారు. వండిన ఆహారాన్ని రుచి చూసి రుచికరంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. తమ శ్రమను గుర్తించి, తమపట్ల ప్రత్యేక శ్రద్ధతో మంచి రుచికరమైన ఆహారాన్ని అందించినందుకు కలెక్టర్ వెట్రిసెల్వి చూపిన శ్రద్ధను పోలింగ్ సిబ్బంది గుర్తు చేసుకుని ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల పర్యవేక్షణలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, రమణ, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, ఏలూరు తహశీల్దార్ శేషగిరిరావు పాల్గొన్నారు.

నిరాశజనకంగా బడ్జెట్: రైతుసంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ ఉందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. ఏలూరు అన్నే భవనంలో రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ తీరుతెన్నులపై శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు రూ.48,341 కోట్లతో ప్రతిపాదించిన వ్యవసాయ బడ్జెట్ రైతాంగానికి ఊరట నిచ్చేదిగా లేదని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులకు అరకొర నిధులే కేటాయించారన్నారు. ఆక్వా రంగానికి విద్యుత్ సబ్సిడీ మినహా ఏ రాయితీలు ప్రకటించలేదన్నారు. ఆక్వా రైతులను గాలికి వదిలేసారని విమర్శించారు. కౌలు రైతులకు మొండి చేయి చూపారని విమర్శించారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగానికి మరిన్ని నిధులు కేటాయించి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు.

'అన్ని రంగాలు అభివృద్ధి చెందేలా బడ్జెట్'


ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాలవారు అభివృద్ధి పథంలో దూసుకుపోయే విధంగా ఉందని జిల్లా సాధికార కమిటీ అధ్యక్షులు కొప్పెర్ల నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారను. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందని తెలిపారు. చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి ఏలూరు ఎంపీ, చింతలపూడి ఎంఎల్‌ఎ పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని కొన్నం గుంట రోడ్డులో ఉన్న మామిడితోటలో ప్రపంచ టైలర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ యూనియన్ ఐకమత్యంతో ముందడుగు వేయాలన్నారు. యూనియన్ సమావేశాల కోసం రాష్ట్ర గృహ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సహకారంతో త్వరలో స్థలం కేటాయించనున్నట్లు తెలిపారు. బిజెపి పట్టణ అధ్యక్షురాలు, మహిళా టైలర్ ఎం.నాగరాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చిన్న వ్యాపారులకు అందించే ముద్ర రుణాలు ప్రతి ఒక్కరూ పొందేలా కృషి చేస్తామన్నారు. నూజివీడు టైలర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు దాసిరెడ్డి అనిల్‌కుమార్ మాట్లాడుతూ టైలర్స్‌ను పాలకులు కార్మికులుగా గుర్తించాలని కోరారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండి.రఫీ, సెక్రటరీ ఎస్‌కె.షబ్బీర్, ట్రెజరర్ నరసింహారావు మాట్లాడుతూ యూనియన్ నిర్మాణం పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. తొలుత వన దేవతకు మహిళా టైలర్లు పూజలు చేసి కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్ హెూవే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మహిళా టైలర్స్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, బిజెపి పట్టణ అధ్యక్షురాలు ఎం.నాగరాణిలను ఘనంగా సన్మానించారు.



నూజివీడులో...

కుక్కునూరు :కుట్టు మిషన్ సృష్టికర్త విలియం హెూ జయంతిని పురస్కరించుకుని టైలర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక సాయిబాబా ఆలయ వీధుల్లో విలియం హెూవే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. టైలర్ల సంఘ అధ్యక్షుడు మాదాలపల్లి ఆనంద్ మాట్లాడుతూ రెడీమేడ్ రంగం బాగా అభివృద్ధి చెందడంతో టైలర్లు గడ్డు స్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. తమను అన్నివిధాలా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాము, రమణయ్య, ఖాదర్ లంకల రమణ, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో ఆగిరిపల్లి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

జిల్లాస్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత తెలిపారు. శుక్రవారం కార్తీక్, లైఫ్ సేవ సంస్థల ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో కృష్ణా జిల్లా స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో జిల్లా నుంచి 23 టీమ్‌లు పాల్గొనగా ఆగిరిపల్లి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విజేతలను అభినందించారు.

వికలాంగునికి కృత్రిమ కాలు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వికలాంగునికి కృత్రిమ కాలు అందించారు. టి.నరసాపురం మండలం ముత్యాలమ్మపేటకు చెందిన తాత నాగేశ్వరరావుకు విద్యుత్ షాక్ గాయం వల్ల వైద్యులు కుడి కాలు తొలగించారు. అంగవైకల్యంతో నాగేశ్వరరావు నడవలేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం దృష్టికి తెలియజేయగా దాతల సహకారంతో కృత్రిమ కాలు అందించారు. జంగారెడ్డిగూడేనికి చెందిన సేవా సంస్థ వ్యవస్థాపకులు బిరుదుగడ్డ ఆసిబాబు సహకారంతో ఏర్పాటుచేసిన కృత్రిమ కాలును నాగేశ్వరరావు నివాసం వద్దకు తీసుకెళ్లి అందించామని అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా తెలిపారు. దాతల సహకారంతో సంఘ సభ్యులు చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నేలపూలు ప్రభాకరరావు పాల్గొన్నారు.

దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కీటకాల్లో దోమ చాలా ప్రమాదకరమైందని, దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. ఏలూరులోని జెపి కాలనీలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న వెంకన్న చెరువు సచివాలయంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోవిందరావు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువ వ్యాధులు దోమ కుట్టడం వల్లే సంభవిస్తున్నాయని, మనకు ఎక్కువగా హాని చేసే దోమలు మన ఇంటి లోపల, బయట మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. ప్రతిఒక్కరూ వారానికోసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు.

మృతురాలి కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు పంచాయతీ శివారు వైఎస్ఆర్ కాలనీకి చెందిన వృద్ధురాలు బొల్లు దుర్గమ్మ(80) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ టిడిపి కో-కన్వీనర్ కొడాలి వినోద్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాల నిమిత్తం శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాలనీకి చెందిన టేకు కనకచార్యులు, దుర్గం సుబ్రహ్మణ్యం, మొవ్వ మధు, దాసరి ప్రకాష్ పాల్గొన్నారు.

బలివే ఆలయంలో హుండీల లెక్కింపు

ముసునూరు : మండలంలోని బలివేలో శ్రీ భలే రామలింగేశ్వర స్వామి ఆలయంలో హుండీలను శుక్రవారం లెక్కించినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య తెలిపారు. ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించగా హుండీలను దేవాదాయ శాఖ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ అనురాధ, దేవాదాయశాఖ ఉన్నతాధికారులు సీసీ కెమెరాల పర్యవేక్షణలో లెక్కించారు. పర్మినెంట్ హుండీలు ఆరు, మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన 21 హుండీలు మొత్తం 27 హుండీలు లెక్కించగా రూ.13,77,981 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. టిక్కెట్ల రూపంలో రూ.12 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రైలు ఢీకొని యువకుడు మృతి

మండవల్లి : రైలు ఢీ కొని యువకుడు మృతి చెందిన సంఘటన మండవల్లి రైల్వేస్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రాత్రి సుమారు 11:05 సమయంలో కీ మ్యాన్ రైలు పట్టాలు పరీక్షిస్తుండగా పట్టాలపై మృతదేహం ఉన్నట్లు గమనించి రైల్వే స్టేషన్‌కు సమాచారం అందించాడు. గుడివాడ రైల్వే పోలీసులు శుక్రవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన పరిస్థితిని పరిశీలించారు. రైలు ఢీ కొట్టినట్లు గమనించి మృతుడు పేరి రాము పెద్ద కుమారుడు ఆంజనేయులుగా(19) గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఆసుపత్రికి తరలించి పంచనామా అనంతరం బంధువులకు అప్పగించామని ఎస్ఐ మహబూబ్ షరీఫ్ తెలిపారు.

గ్రామీణులకు అందని ద్రాక్షగా వైద్యం

విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఎప్పుడు తెరిచి ఉంటాయో తెలీని పరిస్థితి
సమయపాలన పాటించని సిబ్బంది
సకాలంలో వైద్యం అందక రోగుల అవస్థలు


మూసిఉన్న కానుకొల్లు విలేజ్ హెల్త్ క్లినిక్

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ ఎప్పుడు తెరిచి ఉంచుతారో తెలియని పరిస్థితి నెలకొంది. కానుకొల్లులో వైద్యం అందించాల్సిన విలేజ్ క్లినిక్ శుక్రవారం మూతపడి అధికారుల పర్యవేక్షణ లోపాన్ని రోగులకు అందిస్తున్న వైద్యం తీరును తేటతెల్లం చేస్తుంది. దీంతో వైద్యం కోసం ప్రయివేట్ వైద్యశాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తక్షణమే వైద్య సేవలందించే విధంగా గత ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చి అధునాతనమైన పరికరాలతో పాటు వైద్యానికి సంబంధించిన మందులను అందుబాటులోకి తీసుకొచ్చింది. సకాలంలో వైద్యం అందించే విధంగా ఎంఎల్‌హెచ్‌పి (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్) ఎఎన్ఎం, ఆశావర్కర్లను పూర్తిస్థాయిలో నియమించింది. వీరు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ విలేజ్ క్లినిక్‌ను ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తెరచి ఉంచి వైద్య సేవలు అందించాల్సి ఉంది. రోగులను పరీక్షించి మందు బిళ్లలను అందించడంతోపాటు అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి రోగి పరిస్థితిని బట్టి సెలైన్లను కూడా పెట్టాల్సి ఉంది. రోగికి అత్యవసర పరిస్థితి ఏర్పడితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందించాల్సి ఉంది. కానుకొల్లు విలేజ్ క్లినిక్ సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ఎప్పుడు తెరిచి ఉంటుందో తెలియని పరిస్థితి అని రోగులు వాపోతున్నారు. శుక్రవారం విలేజ్ క్లినిక్ మూతబడి ఉంది. దీంతో వైద్యం అందక నానా అవస్థలు పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడడంతో విలేజ్ క్లినిక్‌ల లక్ష్యం నీరు కారిపోతుందని విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి విలేజ్ క్లినిక్ తెరచి ఉంచడంతో పాటు సిబ్బందిని అందుబాటులో ఉంచి సకాలంలో వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు. దీనిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు పవిత్రను వివరణ కోరగా సిబ్బంది భోజనానికి వెళ్లడంతో తలుపులు వేసినట్లు తెలిపారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - భీమడోలు

సైన్సును జీవన విధానంగా మలుచుకోవడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చని పలువురు వక్తలు తెలిపారు. మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. జెఎంవి పురంలోని పాఠశాలలో నిర్వహించి చిన కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయులు నిర్మలకుమారి, మండే సుధాకర్ నేతృత్వం వహించారు. అన్నేవారిగూడెం ఎంపిపి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. రెండు పాఠశాలల్లో సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల లవేసి నివాళులర్పించారు. అన్నేవారిగూడెం పాఠశాలలో గ్రూపుల వారీగా సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానాన్ని దాసరి కృష్ణ చైతన్య కుమార్ గ్రూపు, ద్వితీయ స్థానాన్ని అన్నెం నాగ సుబ్రహ్మణ్యం గ్రూపు దక్కించుకున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులను అందించింది.

చింతలపూడి : స్థానిక చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ శాఖల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సివి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన కీర్తిని కొనియాడారు. వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్రకుమార్, రసాయన శాస్త్ర అధ్యాపకులు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడారు.

పోలవరం :గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే సంబరాలు ఘనంగా నిర్వహించారు.


ఆగిరిపల్లిలో...

సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. పిల్లలు పలు సైన్స్ ప్రాజెక్ట్ ప్రదర్శించారు. సైన్స్‌కు సంబంధించిన రంగవల్లులు వేశారు. ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్ మాట్లాడారు.

ఆగిరిపల్లి : సైన్స్ ప్రాముఖ్యత పట్ల ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన పెంపొందించుకోవాలని ఆగిరిపల్లి ఎంఇఒ కె.ఆనంద్‌కుమార్ అన్నారు. ఆగిరిపల్లి శ్రీ వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన తిలకించారు. ఎస్‌వి.పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మానుకొండ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని ఈదర, ఎం.సూరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈదర ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శారద, గ్రామ సర్పంచి డి.అనిత ఏసుపాదం, అయ్యంకి సురేష్‌బాబు, సూరవరం ప్రధానోపాధ్యాయురాలు ఎన్.రవీంద్ర భవానీ, నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : సర్ సివి.రామన్ రామన్ ఫలితాన్ని ఆవిష్కరించిన సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సైన్స్ డిపార్టుమెంట్స్ ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు మూఢ నమ్మకాలను, అంధ విశ్వాసాలను పారద్రోలడానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

టి.నరసాపురం: మండలంలోని మక్కినవారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సివి.రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శరత్ బాబు, రాములు, వాసు, సుమతీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి : చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు విద్యలో రాణించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు ఆకాంక్షించారు. విద్యార్థులు తయారుచేసిన వైజ్ఞానిక ఆవిష్కరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు.

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - దెందులూరు

మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు మొదలవుతున్న నేపథ్యంలో సమస్యాత్మక పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ జె.రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. కమిషన్ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఫీజు చెల్లించని కార ణంగా జిల్లాలో అక్కడక్కడ విద్యార్థులను యాజమా న్యాలు హాల్ టిక్కెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నా యన్నారు. అలాంటివాటిపైన అధికారులు దృష్టి పెట్టాలని కోరారు.

పరీక్షలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

పోలవరం :స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపల్ కె.సజిని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, మంచినీళ్ల ఏర్పాటు చేశామని, మెడికల్ క్యాంపు, 144 సెక్షన్ అనుసరిస్తూ పోలీస్ బందోబస్తులతో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. మొదటి సంవత్సరం 86 మంది, ద్వితీయ సంవత్సరం 30 మంది మొత్తం 112 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగా చేరుకోవాలని, హాల్ టికెట్, గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రశాంతంగా ఉండాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలని, మంచి ఫలితాలు సాధించాలని ప్రిన్సిపల్ ఆకాంక్షించారు.

నూరు శాతం మార్కులు తెచ్చుకోవాలి

ముసునూరు :పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం మార్కులు తెచ్చుకోవాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు ఆకాంక్షించారు. ముసునూరు జెడ్‌పిహెచ్ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. పరీక్షలకు సంబంధించి సూచనలు, సలహాలు తెలిపారు.

టిడిపిలోకి జెడ్‌పిటిసి శామ్యూల్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

వైసిపి ద్వారకాతిరుమల జెడ్‌పిటిసి చిగురుపల్లి శామ్యూల్ టిడిపిలోకి వెళ్లారు. శామ్యూల్‌ను టిడిపి కేంద్ర కార్యాలయంలో గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకట రాజు సమక్షంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రసాదరావుకు సత్కారం

ప్రజాశక్తి - చాట్రాయి

విద్యార్థులను ఉన్నతమైన స్థాయికి చేర్చేది ఉపాధ్యాయులేనని ఎంఇఒలు కె.సర్వేశ్వరరావు, బ్రహ్మాచారి అన్నారు. మండలంలోని పోలవరం గ్రామంలో కోనేరు రంగారావు కాలనీలోని ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయు లుగా పని చేస్తున్న పగుట్ల ప్రసాదరావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం శుక్రవారం పాఠశాలలో ప్రధానోపా ధ్యాయులు ఆర్.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పశువులకు గాలికుంటు టీకాలు వేయించడం ద్వారా వాటి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని మండల పశు వైద్యాధికారి కె.కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక పశువైద్య శాల వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 15 పంచాయతీల పరిధిలో 21,651 గేదెలు, 5,100 ఆవులు ఉన్నాయని తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా మార్చి ఒకటో తేదీ నుంచి 31 తేదీ వరకు గాలికుంటు టీకాలు ఉచితంగా వేయనున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు నెలల నుంచి ఎనిమిది నెలల పెయ్య దూడలకు కూడా బ్రూసెల్ల వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు.

పింఛన్లు 7 గంటల నుంచి పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సమయాలు మారినట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. పింఛన్లను ఇకపై ఉదయం ఏడు గంటల నుంచి పంపిణీ చేయడం ప్రారంభిస్తారన్నారు. ఒకటో తేదీన పింఛన్లు తీసుకొని లబ్ధిదారులకు, తిరిగి మరో విడతగా మూడో తేదీన పంపిణీ చేస్తారని తెలిపారు.

సబ్‌జోన్, సెంట్రల్ జోన్ క్రీడల్లో విజయ్‌కుమార్ ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఉన్న శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతున్న గోపు విజయ్‌కుమార్ ఆగిరిపల్లి సబ్ జోన్ వంద మీటర్ల పరుగుపందెంలో సిల్వర్ మెడల్, సర్టిఫికెట్, జిల్లా ఇండోర్ స్టేడియంలో జరిగిన సెంట్రల్ జోన్ పోటీల్లో వంద మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్, సర్టిఫికెట్ సాధించాడని పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు పి.రాధికారాణి తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారుడిని ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ బావిశెట్టి వీరయ్య క్రీడాకారుడిని అభినందించారు.

చెట్లను నరికి కలప పట్టుకుపోతున్న మాఫియా

చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు

ఉంగుటూరు : యర్రమిల్లిపాడులో రోడ్ల వెంబడి పలు వృక్షాలను నరికి కలపను ట్రాక్టర్లపై ఎత్తుకుపోతున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు విమర్శిస్తు న్నారు. స్థానిక రాజశేఖర్‌రెడ్డి విగ్రహం సమీపంలో వృక్షాలను నరికిన కలపను నెంబర్లు లేని ట్రాక్టర్లపై శుక్రవారం రాత్రి లోడు చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. కలప మాఫియాను ప్రశ్నించగా చెట్లు మీరు నాటారా అంటూ వ్యంగంగా సమాధానం చెబుతున్నారని, పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు విమర్శలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎంపిడిఒ రాజ్‌మనోజ్ దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేయిస్తామని తెలిపారు.


కలపను లోడు చేస్తున్న మాఫియా

నేడు వెల్లమెల్లిలో పిఎంఎంఎస్‌వై ప్రారంభం

ఉంగుటూరు :ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎంఎస్‌వై) పథకంలో భాగంగా మార్చి ఒకటో తేదీన ఉంగుటూరు మండలం వెల్లమెల్లిలో ప్రారంభిస్తున్నారు. ఈ పథకం అనేది చేపల ఉత్పత్తి, ఉత్పాదకత, నాణ్యత, సాంకేతికత, పంట అనంతర మౌలిక సదుపాయాలు, నిర్వహణ, ఆధునికీకరణ, విలువ గొలుసును బలోపేతం చేయడం, ట్రేస్‌బిలిటీ, పటిష్టమైన మత్స్య నిర్వహణ ఫ్రేమ్‌వర్క్, మత్స్యకారుల సంక్షేమంలో కీలకమైన అంతరాలను పరిష్కరించడానికి రూపొందించినట్లు బాదం పూడి మత్స్యశాఖ కార్యాలయం అధికారి కె.మంగారావు తెలిపారు. వీరభద్ర కర్ర చెరువులో 60 వేల చేపలను వదిలిపెట్టి వాటిని బొమ్మిడి సొసైటీ సభ్యులకు అందిస్తామని చెప్పారు.

2న ఐఎఫ్‌టియు సంఘాల విలీన సభ

ఏలూరు అర్బన్ :మార్చి రెండో తేదీన రాజమండ్రిలో జరిగే రెండు ఐఎఫ్‌టియు సంఘాల విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ విలీన సభను విజయవంతం చేయాలని కోరారు. మీసాల రమణ, విజయ్, గడసాల రమణ, పల్లి గంగరాజు పాల్గొన్నారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమలో సుప్రసిద్ధ శైవక్షేత్రం గోదావరిలో ఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు విజయవంతంగా ముగిశాయని, యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఉత్సవ కమిటీ వైస్ ఛైర్మన్, పోలవరం తహశీల్దార్ సాయిరాజు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, పోలీసు శాఖ, పంచాయతీ శాఖ సిబ్బంది, విద్యుత్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖలు, ఫెర్రీ కాంట్రాక్టర్ల సమన్వయంతో యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. యాత్రికులు కూడా సహకరించడం వల్ల ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయన్నారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ పారిశుధ్య సిబ్బంది నిరంతరం శ్రమించారని తహశీల్దార్ చెప్పారు. ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు ఆలయ కమిటీ సభ్యులకు, సిబ్బందికి, పోలీసు, పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులకు, సిబ్బందికి తహశీల్దార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య పనులు

ఉత్సవం అనంతరం ఆలయ పరిసరాలు ఇసుక తిప్పలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. జిల్లా పంచాయతీ శాఖాధికారి రజాఉల్లా ఉత్తర్వుల ప్రకారం పోలవరం ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆదేశానుసారం ఇఒపిఆర్‌డి పర్యవేక్షణలో పోలవరం మండలంలోని 15 పంచాయతీల నుంచి సుమారు 46 మంది పారిశుధ్య కార్మికులు రంగంలో దిగి యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ప్రాంగణం, సమీపంలోని ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. పారిశుధ్య కార్మికులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, చెత్తను వేరు చేసి, ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ కోసం తరలించారు. పుచ్చకాయ ముక్కల చెత్తను ఇసుకలో గోతులు తీసి పూడ్చిపెట్టారు.

అఖండ అన్న సమారాధన

టి.నరసాపురం :స్థానిక శివాలయంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న శివరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆఖరిరోజైన ఐదో రోజు 13 వేల మందికి అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి సూరిబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. మండలంలోని నలుమూలల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని ఆలయ కమిటీ సభ్యులు పర్వతనేని మురళీ, పసుమర్తి రాము తెలిపారు.

లైబ్రేరియన్‌గా రాంబాబు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైబ్రేరియన్‌గా లక్ష్మీపురపు రాంబాబు అందించిన సేవలు మరువలేనివని, వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత అన్నారు. ఆగిరిపల్లి జెడ్‌పి స్కూల్‌లో గత ఆరేళ్లగా లైబ్రేరియన్‌గా సేవలందించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేస్తున్న లక్ష్మీపురపు రాంబాబు దంపతులను ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు, పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు.

అభయ రక్షక దళ సభ్యుల గస్తీ

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, మహిళా ఎస్ఐ కాంతిప్రియ సిబ్బంది అభయ రక్షక దళ సభ్యులు గస్తీ నిర్వహిస్తున్నారు. మహిళలు, బాలికలు, వృద్ధుల రక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సైబర్ నేరాలు, మహిళలపై ఆకతాయిల వేధింపులు, ఇతర భద్రతా సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలు, మహిళల భద్రతకు అవసరమైన సూచనలు, ఆత్మరక్షణ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేస్తున్నారు.

గిరిజన చట్టాలను గౌరవిస్తాం

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజన చట్టాలను గౌరవిస్తామని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు తెలిపారు. మండలంలోని బర్రింకలపాడు ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కుతోందని వస్తున్న వాదంతులను నమ్మవద్దన్నారు. గిరిజన చట్టాల అమలు పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు.